సాక్షి
నిర్మల్
శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



గరిష్టం/కనిష్టం
31.1 /23.1

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. గాలిలో తేమ తగ్గుతుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఒకటిరెండు చోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఆర్బీఐ పోటీలో పాల్గొనాలి



మండల కేంద్రంలో మాట్లాడుతున్న రాంగోపాల్,ఎల్‌డీఎం

**లక్ష్మణచాంద:** విద్యార్థులు ఆర్‌బీఐ నిర్వహిస్తున్నారు క్విజ్ కాంపిటీషన్ పోటీలో పాల్గొనాలని లీడ్ డిస్ట్రిక్ట్(ఎల్‌డీఎం)మేనేజర్ రాంగోపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీజీ డిగ్రీ కళాశాల విద్యార్థులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్‌బీఐ 90వ వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ఇద్దరు విద్యార్థులు కలిసి ఒక జట్టుగా పాల్గొనాలన్నారు. మొత్తం 36 ప్రశ్నలకుగాను 15 నిమిషాల సమయం కేటాయించడం జరుగుతుందన్నారు. ఇందులో విద్యార్థులు పాల్గొని బహుమతులు పొందాలని సూచించారు. జిల్లాస్థాయిలో మొదటి బహుమతి పొందిన విద్యార్థికి రూ.2 లక్షలు, రెండో బహుమతి పొందిన విద్యార్థికి రూ.1.50 లక్షలు, మూడో బహుమతి పొందిన విద్యార్థికి రూ.లక్ష బహుమతి అందజేస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి సాధించిన విద్యార్థికి రూ.10 లక్షలు రెండో బహుమతి పొందిన విద్యార్థికి రూ.8 లక్షలు, మూడో బహుమతి పొందిన విద్యార్థికి రూ.6 లక్షల అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో ప్రిన్సిపాల్ భోజన్న తదితరులు పాల్గొన్నారు.

### అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

**కుభీర్:** మండలంలోని పల్సి ఉన్నత పాఠశాలను డీఈవో రవీందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యం కోసం చదవాలని, 10వ తరగతిలో 10 జీపీఏ సాధించాలన్నారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, ఎర్రన్న, సాయికుమార్, సంజీవ్, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

### 16న జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

**నిర్మల్ రూరల్:** జిల్లాస్థాయి జూనియర్, సబ్ జూనియర్స్ బాల, బాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు ఈనెల 16న జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, చందుల స్వామి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సహస్ర మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులు 2008, జనవరి 1 నుంచి 2009 డిసెంబర్ 31 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 21, 22 తేదీలలో హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో జరిగే ఓపెన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాల కోసం 99666 77105 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### వుషూ క్రీడాకారులకు అభినందన



శ్రీకాంత్‌తో జాతీయ క్రీడాకారులు

**నిర్మల్ రూరల్:** ఈ నెల 21 నుంచి 26 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే 33వ సీనియర్ జాతీయ స్థాయి వుషూ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఎడిపెల్లి మృణాళిని(వింగ్ చున్ విభాగంలో), నాంపల్లి శివ ప్రసాద్ (కీయాన్సు విభాగంలో), యర్వ సాయికిరణ్(70 కేజీలు)లు డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డిని కలిశారు. ఈనెల 1న మంచిర్యాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి 3 బంగారు పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో కోచ్ జ్ఞానతేజ, జిల్లా మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షుడు తేజేందర్‌సింగ్ భాటియా, శ్రీకాంత్, భూషణ్, శ్రీరాముల సాయికృష్ణ, శివరాజ్‌గౌడ్, నితిన్‌గౌడ్, లింగం, అనూష తదితరులు పాల్గొన్నారు.

# గూడు చెదిరె..



**ఈ చిత్రంలో** కనిపిస్తున్న వ్యక్తి లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట సుదర్శన్. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇతని ఇల్లు కూలిపోయింది. దీంతో నిరాశ్రయుదయ్యాడు. నిరుపేద కావడంతో ఇబ్బంది పడుతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.



**కూలిపోయిన** ఇంటి వద్ద దీనంగా నిల్చున్న ఈ మహిళ పేరు భూని సుశీల. రాచాపూర్ గ్రామానికి చెందిన సుశీల ఇల్లు ఇటీవలి వర్షాలకు కూలిపోయింది. సామగ్రి ధ్వంసమైంది. దీంతో ప్రస్తుతం కిరాయి ఉంటోంది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతోంది.



ఇల్లు కూలిపోయిన మహిళతో మాట్లాడుతున్న నోడల్ అధికారి భవేష్‌మిశ్రా, కలెక్టర్ అభిలాష అభినవ్

- ఇటీవలి వర్షాలకు కూలిన ఇళ్లు
- జిల్లా వ్యాప్తంగా 76 ఇళ్లు నేలమట్టం
- రోడ్డునపడ్డ పలు కుటుంబాలు
- సాయం కోసం ఎదురు చూపులు

**లక్ష్మణచాంద:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వాగులు పొంగాయి. గోదావరి ఉగ్రరూపం దాల్చింది. చెరువులు మత్తడి పోయడంతో పంటలు దెబ్బతిన్నాయి. ఇక వర్షాల కారణంగా వివిధ గ్రామాల్లో పలువురి ఇళ్లు కూలిపోయాయి. దీంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. కూలిపోయిన ఇళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కానీ పది రోజులైనా బాధితులకు ఎలాంటి సాయం చేయలేదు. దీంతో తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

**20 ఇళ్లు పూర్తిగా.. 56 ఇళ్లు పాక్షికంగా..**

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని 19 మండలాలకు చెందిన 396 గ్రామాల పరిధిలో మొత్తం 76 ఇళ్లు కూలిపోయాయి. ఇందులో 20 ఇళ్లు పూర్తిగా కూలిపోగా 56 ఇళ్లు పాక్షికంగా కూలిపోయినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. నష్టం అంచనా వేశారు. కానీ, బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి సాయం చేయలేదు.

**మండలాల వారీగా ఇలా...**

- లక్ష్మణచాంద మండలంలో 17 ఇళ్లు కూలిపోయాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇందులో 13 ఇళ్లు పాక్షికంగా కూలిపోగా నాలుగు ఇళ్లు పూర్తిగా కూలినట్లు పేర్కొన్నారు.
- కుంటాల, బాసర మండలాల్లో నాలుగు చొప్పున ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి.
- లోకేశ్వరం మండలం హవర్గలో 1, జోహర్‌పూర్‌లో 1 పూర్తిగా కూలిపోగా, మరో 8 ఇళ్లు పాక్షికంగా కూలిపోయినట్లు తెలిసింది.
- దస్తురాబాద్ మండలం మున్యాల్ గ్రామంలో ఒకటి, అలాగే మూడు పాక్షికంగా కూలిపోయాయి.
- కడెం మండలంలో మూడు ఇళ్లు పూర్తిగా, ఒకటి పాక్షికంగా కూలిపోయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.
- తానూరు మండలం తొండాల గ్రామంలో ఒక ఇల్లు కూలిపోయింది.
- ఖానాపూర్ మండలంలో మూడు ఇళ్లు పూర్తిగా, రెండు ఇళ్లు పాక్షికంగా కూలినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.
- భైంసా మండలంలో ఐదు ఇళ్లు పూర్తిగా, రెండు ఇళ్లు పాక్షికంగా కూలిపోయినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు.
- దిలావార్‌పూర్ మండలంలో రెండు ఇళ్లు పూర్తిగా, మరో మూడు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయని అధికారులు తెలిపారు.
- కుభీర్ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఒక ఇల్లు కూలిపోయింది. మామడ మండలంలో ఒక ఇల్లు పూర్తిగా, ఆరు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయని అధికారులు గుర్తించారు.
- ముధోల్ మండలంలో ఏడు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. పెంబి మండలంలో 8 ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి.
- నిర్మల్ రూరల్ మండలంలో ఒక ఇల్లు పూర్తిగా, మరో ఏడు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి.

**వివరాలు సేకరించిన అధికారులు....**

భారీ వర్షాలకు కూలిన ఇళ్ల వివరాలను ఆయా మండలాలకు చెందిన రెవెన్యూ అధికారులు సేకరించారు. ఇప్పటికే అన్ని తహసీల్దార్ కార్యాలయాల నుంచి పూర్తి వివరాలు సేకరించి కలెక్టర్ అభిలాష అభినవ్ ద్వారా ప్రభుత్వానికి నివేదించినట్లు అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. ఇటీవల జిల్లా నోడల్ అధికారి భవేష్ మిశ్రా, కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామంలో కూలిన ఇళ్లను సందర్శించారు. ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్ కూడా ఇళ్లు కూలిన బాధితులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ఇళ్లు కూలిన బాధితులకు పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**త్వరగా సాయమందించాలి..**



ఇటీవల కురిసిన పెద్ద వానలకు ఇల్లు కూలిపోయింది. సామాన్లు ధ్వంసమయ్యాయి. బాగా నష్టం జరిగింది. ఇప్పుడు కిరాయి ఇంట్లో ఉంటున్న. ఇళ్లు కూలిన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. తక్షణ సాయంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలి.
– గుండారపు లక్ష్మి, రాచాపూర్

**ఖాతాల్లో పరిహారం..**

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు 76 ఇళ్లు కూలిపోయాయి. జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఇళ్లు కూలిపోయిన వ్యక్తుల వివరాలను తహసీల్దార్ల ద్వారా సేకరించాం. కలెక్టర్ అభిలాష అభినవ్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే ప్రభుత్వం వచ్చేపరిహారం నేరుగా బాధితుల ఖాతాల్లోనే జమ అవుతుంది.
– కిశోర్‌కుమార్, అడిషనల్ కలెక్టర్



ముధోల్‌లో వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

# బైబై గణేశా



జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏడు రోజు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మండపాల్లో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గణనాథునికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ముధోల్, లోకేశ్వరం మండలాలతోపాటు నిర్మల్ పట్టణంలోనూ కొన్ని మండపాల నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ముధోల్‌లో ఎస్పీ జానకీషర్మిల వినాయకునికి పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఉంచి వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నృత్యాలు, కోలాటాలు వేశారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో వంద మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనంతరం వీడీసీ ఆధ్వర్యంలో ఏఎస్పీ, సీఐలను సన్మానించారు. లోకేశ్వరం మండలంలోని వట్టోలి, కన్కపూర్, హద్గాం, పుస్పూర్ గ్రామాల్లో గణేశ్‌లను గోదావరిలో, చెరువుల్లో నిమజ్జనం చేశారు.
- ముధోల్/లోకేశ్వరం



హద్గాంలో గణేశ్ శోభాయాత్రలో భక్తులు



నిర్మల్‌లో నిమజ్జన శోభాయాత్ర



ఖానాపూర్ పట్టణంలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిమజ్జన శోభాయాత్రలో ప్రదర్శన

### లక్కీడ్రా విజేతల ఎంపిక

**భైంసాటౌన్:** ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారి కోసం గతనెలలో లక్కీ డ్రా అవకాశం కల్పించింది. డ్రా బాక్సుల్లోని టిక్కెట్లను శుక్రవారం డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఎం హరిప్రసాద్ విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో కంట్రోలర్ భీమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# హైడ్రా పేరుతో డ్రామా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి రామారావు పటేల్

**భైంసాటౌన్:** రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో డ్రామా చేస్తోందని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ విమర్శించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో శుక్రవారం మాట్లాడారు. ప్రభుత్వం హైడ్రా పేరుతో ధనికులను వదిలేస్తూ, పేదల ఇళ్లను కూల్చివేస్తోందని ఆరోపించారు. ఇలాంటి రాజకీయ కక్ష సాధింపు చర్యలను సహించేది లేదన్నారు. చెరువుల్లో ఆక్రమణలను పక్షపాత ధోరణి లేకుండా తొలగిస్తే అందరూ హర్షిస్తారని, పేదల ఇళ్లు తొలగించే ముందు వారికి పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. హైడ్రాకు తాము వ్యతిరేకం కాదని, కానీ పక్షపాత ధోరణి సరికాదన్నారు. అలాగే, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వకుండా కాలయాపన చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. తెల్లరేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వమే రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తోందని, అర్హులైన పేదలందరికీ కార్డులిస్తే ప్రయోజనం చేకూరుతుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్

**నిర్మల్‌చైన్‌గేట్:** కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టడానికి, లార్వా దశలోనే దోమల అభివృద్ధిని అడ్డుకోవడానికి ప్రతీ మంగళ, శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 563 బృందాల ద్వారా 'డ్రైడే' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలు, పట్టణాలు, కాలనీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆసుపత్రులలో జూన్ 2024 నుంచి సెప్టెంబర్ 2024 వరకు 3,84,758 మంది రోగులను పరీక్షించగా 89 మందికి డెంగీ పాజిటివ్ వచ్చిందని పేర్కొన్నారు. ఒకరికి చికున్‌గున్యా నిర్ధారణ అయినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆర్బీఎస్కే బృందాలు, వైద్యాధికారుల ద్వారా నిరంతరం ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డెంగీ ప్రబలిన గ్రామాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు.



### సామూహిక నృత్య ప్రదర్శన

**భైంసాటౌన్:** పట్టణంలోని గాంధీగంజ్‌లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సామూహిక నృత్య ప్రదర్శన నిర్వహించారు. వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం వివిధ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థినులు ఒకే వేదికపై నృత్యం చేశారు. కార్యక్రమంలో సాదుల కృష్ణదాస్, డాక్టర్ నగేశ్, శ్యాంసుందర్ మంధాని, ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# పల్లె ఓటర్లు 4.40 లక్షలు

- ముసాయిదా జాబితా విడుదల చేసిన అధికారులు
- ఈ నెల 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న తుది జాబితా విడుదల
- జిల్లాలోని 400 గ్రామ పంచాయతీలు, 3,368 వార్డులు



కుభీర్ మండలంలో ఓటరు జాబితా ముసాయిదాను ప్రకటిస్తున్న పంచాయతీ అధికారులు

| |
|---|
| మొత్తం మండలాలు 18 |
| మొత్తం జీపీలు 400 |
| మొత్తం వార్డులు 3,368 |
| మొత్తం ఓటర్లు 4,40,997 |
| స్త్రీ ఓటర్లు 2,10,146 |
| పురుష ఓటర్లు 2,30,836 |
| ఇతర ఓటర్లు 5 |

**నిర్మల్‌చైన్‌గేట్:** పల్లెపోరు నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1తో సర్పంచుల పదవీకాలం ముగిసింది. దీంతో పల్లెల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ఎన్నికల కసరత్తులో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజించారు. జిల్లాలో 400 గ్రామ పంచాయతీలు, 3,368 వార్డులు ఉన్నాయి. వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల్లో శుక్రవా రం ప్రదర్శించారు. అభ్యంతరాలు స్వీకరించి ఈనెల 28న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.

**గతనెల 26 నుంచి ప్రక్రియ ప్రారంభం...**

గత నెల 26 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, ఆయా పంచాయతీల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు సహాయ ఎన్నికల అధికారులుగా ఉన్న ఎంపీడీఓలు, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మల్టీపర్పస్ వర్కర్లు ఓటరు జాబితాను ఇటీవల సిద్ధం చేశారు. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలోని ఓటర్లను ఆ పంచాయతీలో ఉన్న వార్డులతో భాగించి ఈ జాబితాలను తయారు చేశారు. గడిచిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాను ప్రాతిపదికగా తీసుకుని ఈ విభజన చేశారు. వార్డుల విభజన చేసేటప్పుడు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఒకే వార్డులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే కొత్తగా వచ్చే ఓటర్లు ఎవరైనా ఉంటే వారు స్థానికంగా నివాసం ఉండే వార్డుకు మాత్రమే అనుసంధానం చేస్తామని, చివరి వార్డుకు కాదని ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి స్పష్టం చేసిన మేరకు జాబితాను తయారు చేశారు.

**400 పంచాయతీలు.. 4,40,997 ఓటర్లు..**

జిల్లాలో 400 పంచాయతీలు ఉండగా వాటిలో 3,368 వార్డు లున్నాయి. మొత్తం 4,40,997 మంది ఓటర్లు ఉన్నారు. శుక్రవారం ప్రతీ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆ గ్రామాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించారు. అనంతరం 14వ తేదీ నుంచి 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 26వ తేదీలోగా జిల్లా పంచాయతీ అధికారి వాటిని పరిష్కరించి.. 28న గ్రామపంచాయతీల తుది ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రకటిస్తారు. ఓటర్ల జాబితా ప్రచురణకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొన్న విధంగా 18న జిల్లాస్థాయి, 19న మండలస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. ఓటరు ముసాయిదాలో లోపాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే వారు పరిష్కరిస్తారు.

**28న తుది జాబితా..**

వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాలు తయారైనప్పటికీ కొత్త ఓటరుగా తహసీల్దార్ కార్యాలయం లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఈ అవకాశం ఉంది. శుక్రవారం సిద్ధం చేసిన ముసాయిదా ఓటరు జాబితాను జీపీ కార్యాలయాల్లో ప్రకటించాం. ఇందులో అభ్యంతరాలను స్వీకరించి, సరిచేసి తుది జాబితాను ఈ నెల 28న ప్రకటిస్తాం.
– శ్రీనివాస్, డీపీవో

# సీపీఎస్ రద్దు కోసం ఏకం కావాలి

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు



మాట్లాడుతున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు

**భైంసాటౌన్:** ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ రద్దు కోసం అందరూ ఏకం కావాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోసం అనేక దశల్లో పోరాటం చేసి గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామని తెలిపారు. సీపీఎస్ రద్దు కోసం ఈసారి మండలి బరిలో నిలిచి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తద్వారా చట్టసభల వేదికగా సీపీఎస్ రద్దుపై ప్రభుత్వానికి గళం వినిపించి, ఓపీఎస్ సాధించుకుందామన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ బరిలో..**

**తానూరు:** రాష్ట్రంలో 2 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ లక్ష్యంగా శాసనమండలి బరిలో నిలవబోతున్నట్లు తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కష్ణారావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దశాబ్దకాలంగా సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ అమలు కోసం పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి ఎన్నికల్లో తనకు మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన వేదాంత్‌తో ప్రిన్సిపాల్, పీడీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన వేదంత్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆసిఫాబాద్‌లో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో వేదంత్ ప్రతిభ కనబర్చాడు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ లిబిన్, పీడీ రాకేశ్ శుక్రవారం అభినందించారు. హన్మకొండలో ఈనెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వేదంత్ పాల్గొంటారని వివరించారు. పీఈటీ కిరణ్, అర్చన, బద్రి ఉన్నారు.

### ఒకరి ఆత్మహత్యాయత్నం

ఉట్నూర్‌రూరల్: పెట్రోల్ పోసుకొని ఒంటికి నిప్పంటించుకొని ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉట్నూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం..మండల కేంద్రంలోని పుకట్‌నగర్ కాలనీకి చెందిన మల్లేశ్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో హమాలీగా పని చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలార్పి వేసి ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రెఫర్ చేశారు. కాగా, ఎస్సైని వివరణ కోరగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

### గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

సోన్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. శుక్రవారం డీఎస్పీ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని కడ్తాల్ ఎక్స్‌రోడ్డు వద్ద బైక్‌పై అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు తనిఖీ చేశారు. 1100 గ్రాముల గంజాయి లభించింది. నిర్మల్ జిల్లా సోఫీనగర్‌కు చెందిన లక్ష్మణ్‌గా గుర్తించారు. గతంలో పలు దొంగతనాల కేసుల్లో ఉన్నారని తెలిపారు. నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సోన్ పోలీసులను డీఎస్పీ అభినందించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై కె.గోపి, పోలీసులు ఉన్నారు.

### సీఎస్సీ హెల్త్‌కేర్‌లో ఉద్యోగావకాశాలు

మంచిర్యాలటౌన్: జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల వారీగా సీఎస్సీ హెల్త్‌కేర్‌లో నియామకాలు చేపడుతున్నట్లు సీఎస్సీ స్టేట్ మేనేజర్ సురేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్టీ, డీఎమ్మెల్టీ, బీఎస్సీ ఎమ్మెల్టీ, ఏఎన్ఎం, జీఎన్ఎం అభ్యర్థులు సంబంధిత కోర్సులో పారామెడికల్ బోర్డులో రిజిష్టర్ చేసుకుని ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 15న ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు మంచిర్యాలలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ కొండల్‌రావును 9989165691, డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్ 8977776143 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

### యువత ఆర్థికంగా ఎదగాలి

ఉట్నూర్‌రూరల్: యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ ఎండీ గౌస్ అన్నారు. ఆర్‌సెటీలో బైక్ రిపేర్ శిక్షణ తీసుకున్న 30 మంది యువకులతో ఉట్నూర్ ఐబీలో శుక్రవారం ఉచిత బైక్‌ల సర్వీసింగ్ క్యాంపు నిర్వహించారు. శిక్షకులు ఎండీ షకీల్ ఉన్నారు.




# జాతీయ సమైక్య భాష హిందీ

- జాతీయభాషగా గుర్తింపు
- భిన్న సంస్కృతుల వారధి హిందీ
- నేడు 'జాతీయ హిందీ దివస్'




నిర్మల్‌ఖిల్లా: భారతదేశం వివిధ సంస్కృతులు, విభిన్న భాషలు, నాగరికతలకు నెలవు. ప్రతీ రాష్ట్రానికి ప్రాంతీయ భాష ఉంటుంది. కొన్ని గిరిజన ప్రాంతాలకు వెళ్తే భాష మరోలా ఉంటుంది. ఆయా వర్గాల వారు మరొకరితో మాట్లాడుకునేందుకే అనుసంధానంగా వ్యవహరించేది భాష. దీని ద్వారా మరో వ్యక్తికి మనం చెప్పాలనుకునేది చేరుతుంది. దేశంలో అత్యధికుల నోళ్లలో నానే మాట, భిన్న సంస్కృతుల వారధి..కేంద్ర అధికారిక హోదా అందుకున్న భాష హిందీ. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని జాతీయ అధికారిక భాషగా గుర్తించింది. అప్పటి నుంచి ప్రతీఏటా సెప్టెంబర్ 14న 'హిందీ దివస్'గా జరుపుకొంటున్నారు.



పదో తరగతి హిందీపుస్తకంలో నీటిప్రాధాన్యతను తెలిపే పాఠ్యాంశం

ఈ నేపథ్యంలో సాక్షి కథనం.

**సాహితీవేత్తలు సైతం**

హిందీభాషలో సూరదాసు సూర్యుడిగా, తులసీదాసు చంద్రుడిగా గుర్తింపు పొందారు. వీరు రాసిన సూర్‌సాగర్, రామచరితమానస్‌లు జీవగ్రంథాలుగా పేరుపొందాయి. మీరాబాయి కృష్ణుని భక్తిలో లీనమై రాసిన భజన పాటలు పదావళిలో ఉన్నాయి. సమాజంలోని దురాచారాలను తొలగించడానికి హిందీ ప్రజాకవి కబీర్‌దాస్ తోడ్పడ్డారు.

**హిందీ నేపథ్యం..**

- పర్షియన్ పదం 'హింద్' నుంచి హిందీ పుట్టుకొచ్చింది. ఇండస్ నదీ పారుతున్న నేలలో మాట్లాడే భాష అని దీని అర్థం. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన రెండు భాషల్లో హిందీ ఒకటి. ఇది దేవనాగరి లిపిలో ఉంటుంది. దేశంలో అత్యధికులు మాట్లాడే భాష హిందీ.
- ప్రపంచంలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో నాలుగోస్థానంలో ఉంది. భారత్‌లోనే కాదు.. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, అమెరికా, ఇంగ్లండ్, జర్మనీ, న్యూజిలాండ్, యూఏఈ, ఉగాండా, గయానా, సురినామ్, ట్రినిడాడ్, మారిషస్, దక్షిణాఫ్రికాల్లో హిందీని జనం గణనీయ సంఖ్యలో మాట్లాడుతారు.
- కవులు, రచయితలు కాకా కాలేల్కర్, మైథిలీ శరణ్ గుప్తా, హజారీ ప్రసాద్ ద్వివేదీ, సేథ్ గోవింద్ దాస్, బియోహర్ రాజేంద్ర సింహ.. హిందీ అధికారిక భాషగా గుర్తింపు పొందడంలో విశేష కృషి చేశారు.
- 1949 సెప్టెంబరు 14న రాజ్యాంగంలోని 351వ అధికరణం 8వ షెడ్యూల్‌లో హిందీని జాతీయభాషగా గుర్తిస్తూ ఆ రోజుల్లో పొందుపర్చారు.

**భిన్న సంస్కృతులకు నిలయం**



భారతదేశం..వివిధ భాషలు భిన్న సంస్కృతులకు నిలయం. భారతీయులందరినీ ఏకతాటిపైకి తెచ్చిన భాష హిందీ. ప్రస్తుతం భారతీయ అధికార భాషగా గుర్తింపు పొందింది. – ముత్యాల వాణి, హిందీ ఉపాధ్యాయురాలు

**సంస్కృతిని ప్రతిబింబించే భాష**



హిందీ భాష భారతీయ సంస్కృతిని ఇనుమడింపజేస్తుంది. హిందీలో నీతి కథలు, దోహా పద్యాలు విద్యార్థులకు పరిచయంతోనే భారతీయ సంప్రదాయాలు అవగతం అవుతాయి. పాఠశాల స్థాయి నుంచే హిందీపై అభిరుచిని పెంపొందించాలి. – ఎం.సుందల్‌సింగ్, ఎస్ఏ, హిందీ, పరిమండల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

**హిందీభాష వారసత్వ సంపద**



హిందీ భాష భారతీయులందరి వారసత్వ సంపద లాంటిది. స్వాతంత్రోద్యమ కాలం నుంచి ఈ భాషకు ప్రాముఖ్యత ఉంది. హిందీ భాషాభివృద్ధికి విద్యార్థి దశ నుంచే ప్రోత్సాహం ఉండాలి. – డా.అఖిలేశ్ కుమార్‌సింగ్, హిందీ భాషానిపుణుడు

# సీఎస్పీలో దళారీ మోసం

- గిరిజన మహిళ వేలిముద్రతో రూ.30 వేలు డ్రా
- కుమారుడి సెల్‌ఫోన్‌కు సందేశం
- బ్యాంకు అధికారులను సంప్రదిస్తే విషయం వెలుగులోకి
- దళారీని చితకబాదిన బాధితురాలి కుమారుడు



మాడవి జంగుబాయి

నార్నూర్: గిరిజన మహిళను దళారీ మోసం చేసిన ఘటన నార్నూర్ మండల కేంద్రంలోని సీఎస్పీ సెంటర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గాదిగూడ మండలం రాంపూర్‌కు చెందిన మాడవి జంగుబాయికి రూ.1.30 లక్షల పంట రుణమాఫీ అయింది. రుణమాఫీ డబ్బుల్లో నార్నూర్ ఎస్బీఐలో ఆమె ఖాతాలో రూ.50 వేలు డిపాజిట్ చేసింది. మిగతా రూ.80 వేలకుగాను రూ.50 వేలు డ్రా చేసింది. మధ్యవర్తిగా ఉన్న దళారీ పెందూర్ ప్రభాకర్ ఆమెకు బ్యాంక్ వోచర్ నింపడం, డ్రా చేయడం చేశాడు. డబ్బులు చెక్‌చేద్దామని ప్రభాకర్ ఆమెను నార్నూర్‌లోని సీఎస్పీ కేంద్రానికి తీసుకెళ్లాడు. ప్రభాకర్, నిర్వాహకుడు రవీందర్‌తో ఆమె ఆధార్ కార్డు, వేలిముద్రతో రూ.30 వేలు డ్రా చేశాడు. తర్వాత డబ్బులు జమ కాలేదని నిర్వాహకుడు చెప్పడంతో తిరిగివెళ్లింది. డబ్బులు డ్రా అయినట్లు ఆమె కుమారుడి సెల్‌ఫోన్‌కు మేసెజ్ వచ్చింది. అతను వెంటనే బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే అసలు విషయం తెలిసింది. ఆగ్రహానికి గురైన కుమారుడు..దళారీ అయిన ప్రభాకర్‌ను చితకబాదాడు.నిర్వాహకుడు రవీందర్ బాధిత మహిళకు రూ.30 వేలు అందించాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా సర్దుబాటు చేసినట్లు సమాచారం.



ప్రభాకర్‌ను చితకబాదుతున్న బాధిత మహిళ కుమారుడు

## ఆదిలాబాద్‌లో ఏబీఆర్ఎస్ఎం బృందం పర్యటన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బృందం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: అఖిల భారతీయ మహా సంఘ్ బృందం సభ్యులు జిల్లా పర్యటనకు వచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్, సైన్స్ డిగ్రీ కళాశాల, సంజయ్ గాంధీ తదితర కళాశాలలను శుక్రవారం సందర్శించారు. ఈనెల 21న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నవ భారత నిర్మాణంలో మహిళా 'విద్యావేత్తల పాత్ర' అనే అంశంపై కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి మహిళా లెక్చరర్లు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. వసంత గౌరి, శ్రీనివాస్, సరిత రాణి, నాగరాజు పాల్గొన్నారు.

## సమరశీల పోరాటాలతో సామాజిక న్యాయం

ఖానాపూర్: తెలంగాణలో సామాజిక న్యాయం సమరశీల పోరాటాలతోనే సాధ్యమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ఆర్.ఉపాలి అన్నారు. పట్టణంలోని తాపీమేస్త్రీ సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో నైజాం నిరంకుశ పాలన అంతమైనయా దోపిడీ సాగుతోందని విమర్శించారు. వీరుల త్యాగాలను విస్మరించిన ప్రభుత్వం విలీన దినానికి ఏగనామం పెట్టిందన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే సమరశీల పోరాటాలే సరైన మార్గమని పేర్కొన్నారు. శనివారం పట్టణంలో సీపీఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కడుకుంట్ల రవి, చిలుకూరి ఇస్తారి, అంకం శంకర్, పిట్టల భీమేశ్, చిన్న భీమేశ్, పాషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాలి

### హత్యకేసులో నిందితుడి నుంచి కత్తి స్వాధీనం

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి వాసి జానకొండ నారాయణ హత్యకేసులో ఇద్దరిని మహారాష్ట్రలోని మాండ్వి పోలీసులు రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి పోలీసులు నిందితుడు దేవన్నను పిప్పల్‌కోటి గ్రామానికి తీసుకువచ్చి క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. దేవన్న ఇంట్లో కత్తితోపాటు రక్తపు మరకలతో ఉన్న షర్టును స్వాధీనం చేసుకున్నారు. నారాయణ భార్య విజయలక్ష్మి కొన్ని ఆధారాలు దహనం చేసినట్లు గుర్తించారు. ఆ బూడిదను స్వాధీనం చేసుకున్నారు.

### కుక్కల దాడిలో పొట్టేలు మృతి

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో శుక్రవారం కుక్కల దాడిలో ఓ పొట్టేలు మృతి చెందింది. మునిగెల సర్సయ్యకు చెందిన మేకలు, గొర్రెలు గ్రామంలోని పాకలో కట్టేసి ఉన్నాయి. దాదాపు ఐదు కుక్కలు మందపై దాడి చేయగా ఓ పొట్టేలుకు గాయమైంది. మేకల అరుపులు విన్న స్థానికులు వచ్చి కుక్కలను తరిమారు. గాయపడిన పొట్టేలును ఆటోలో బోథ్‌లోని వెటర్నరీ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కాగా, గ్రామంలో కుక్కల బెడద నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

సోన్: మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందాడు. ఎస్సై కే.గోపి కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం గంగాసముందర్‌కు చెందిన జక్కుల రాకేశ్(29) తన అత్తగారింటికి వెళ్లేందుకు ముప్కాలకు బయల్దేరాడు. అక్కడి నుంచి నిర్మల్‌కు బస్సులో వెళ్లాడు. మార్గమధ్యలో గంజాల్ టోల్‌ప్లాజా వద్ద బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టగా అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మల్లేశ్ ఫిర్యాదుతో శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జైపూర్: మండలంలోని ఇందారం సమీపంలో టేకుమట్ల క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..గోదావరిఖని నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్తున్న లారీని అటువైపు వెళ్తున్న కారు వెనుక భాగం నుంచి వేగంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. కారులో ఉన్న హైదరాబాద్‌కు చెందిన పూసపాటి ఆనంద్ తలకు తీవ్రంగా, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

**ఇంద్రవెల్లి మండలంలో యువకుడికి..**



వెంకటిని రిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. కేస్లాపూర్ పంచాయతీ పరిధిలోని కేస్లాగూడ(జి) గ్రామానికి చెందిన హెరేకుంర వెంకటి సొంత పని నిమిత్తం బైక్‌పై ముత్నూర్ వెళ్లి తిరిగివస్తున్నాడు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై భగీరథ పైప్‌లైన్ కోసం తవ్విన గుంత వద్ద కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక నుంచి బైక్ వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటిని స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. వెంకటి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబీకులు తెలిపారు.

### కోతులదాడిలో వృద్ధురాలికి..

నర్సాపూర్(జి): కోతుల దాడిలో మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు గూండ్ల నాగమ్మ (65) గాయపడింది. ఒకరి ఇంట్లో పని చేస్తుండగా శుక్రవారం కోతులు మూకుమ్మడి దాడిలో ఆమె కాలికి గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో కోతుల బెడద అరికట్టేలా అటవీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు శుక్రవారం ఎస్సార్పీ 3, 3ఏ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీ సైదా మాట్లాడారు. మ్యాన్‌రైడింగ్ చైర్స్ రబ్బర్స్ సరిపడా లేకపోవడంతో చైర్స్‌ను తక్కువ పెట్టి నడిపిస్తున్నారని తెలిపారు. గనిపై ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైడ్ సక్రమంగా పని చేయడం లేదన్నారు. ఆయా సమస్యలను వారు గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్ కార్యదర్శి మురళి చౌదరి, అంబాల రవి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు రోమోజీ, కాజీపేట విక్కి, ఆడెపు సురేశ్ ఉన్నారు.

## నిరంతర సాధనతో క్రీడానైపుణ్యాలు మెరుగు



టెన్నిస్ పోటీలు ప్రారంభిస్తున్న భీంరావు జాడే

రెబ్బెన: క్రీడాకారులు నిరంతర సాధనతోనే క్రీడానైపుణ్యాలు మెరుగుపర్చుకోవచ్చునని బెల్లంపల్లి ఏరియా ఇంజినీర్ భీంరావు జాడే అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో శుక్రవారం డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల నియర్ బై ఏరియా టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ప్రతి ఏరియాలో క్రీడాకారులకు కావల్సిన అన్ని వసతులు కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారులందరూ ఆటల్లో రాణించాలన్నారు. బెల్లంపల్లి, మందమర్రి ఏరియాకు చెందిన క్రీడాకారులు కంపెనీ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికై పతకాలు సాధించాలన్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, సీనియర్ పీవో ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, బెల్లంపల్లి ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

## పవర్ ప్లాంటు నుంచి ఆగిన దుమ్ము ధూళి



ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు నుంచి వస్తున్న దుమ్ముధూళి ఆగిందని ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనిట్–2 క్యాపిటల్ ఓవర్‌హాలింగ్‌లో భాగంగా 84 రోజులు మరమ్మతు చేపట్టి ఆయిల్‌తో లైటాప్ చేయడంతో రెండు గంటలు దుమ్ము ధూళి వచ్చిందన్నారు. తర్వాత అది ఆగిందని తెలిపారు. సోషల్ మీడియాలో ప్లాంటు నుంచి దుమ్ము ధూళి వస్తుందని ప్రచారం జరిగిందన్నారు. ఈనెల 9న అధికారులు చుట్టుపక్కల గ్రామాలు, ఎస్టీపీపీ పరిసర ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ పరికరం పీఎం 10 ద్వారా మానిటర్ చేసి రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. ప్లాంటు నుంచి వెలువడుతున్న దుమ్ము ఎన్ఏఏక్యూఎస్ ప్రకారం నియమ నిబంధనలకు లోబడి ఉందని తెలిపారు. ఎలాంటి విష వాయువులు, కానీ వ్యర్థాలు కానీ వెలువడం లేదని పేర్కొన్నారు.

### బండల నడుమ చేపల వేట!



మత్స్యకారులు ఉపాధి వేటలో ప్రమాదాలను సైతం లెక్కచేయడం లేదు. నార్నూర్ మండలం కుండాయి జలపాతంలో బండరాళ్ల నడుమ శుక్రవారం ఇలా చేపల వేట సాగిస్తున్నారు. ఏ మాత్రం అదుపుతప్పినా అంతే సంగతులు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

### అలంకారప్రాయంగా పల్లె దవాఖానా



ప్రజలకు స్థానికంగానే వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా పట్టణంలోని న్యూహౌజింగ్‌బోర్డులో పల్లె దవాఖానా నిర్మించింది. భవనం పూర్తయి ఏడాది గడిచినా అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనంతో అలంకారప్రాయంగా మారింది. సుందరమైన భవనం కన్పిస్తున్నా అక్కడ వైద్యసేవలు అందకపోవడం రోగులకు ఇబ్బందిగా మారింది. - సాక్షి ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్

## అక్రమ నిర్మాణాలు కూల్చేస్తారా..?

- కలెక్టర్ ఆగ్రహంతో నోటీసులు జారీ
- మిగతా సర్వే నంబర్ల సంగతి ఏమిటి..?



గెర్రె కాలనీలో గుర్తించిన అక్రమ నిర్మాణాలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని 840 సర్వేనంబరు గెర్రెకాలనీ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన షెడ్లు, ఇళ్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. స్థానిక తహసీల్దార్ గుర్తించిన అక్రమ నిర్మాణాలకు నోటీసులు అందజేస్తూ మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇంటి స్థలం ఎలా వచ్చింది, స్థలం పత్రాలు అందజేయాలని సూచించారు. అక్రమ నిర్మాణాలపై రెండేళ్ల క్రితం నోటీసులు జారీ చేసినా ఆ తర్వాత ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇటీవల చెన్నూర్‌లో అమృత్ 2.0 వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల భూమి పూజకు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, వివేక్‌లతో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. పక్కనే ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు గుర్తించిన ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తారా అని నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ కూల్చేస్తే మిగతా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాల సంగతి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. గతంలో కిష్టంపేట పంచాయతీ పరిధి జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ భూముల్లో 50 ఇళ్ల అక్రమ నిర్మాణాలను అప్పటి తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేశారు. కాగా, గెర్రెకాలనీలో 22 మందికి నోటీసులు జారీ చేయగా 10 మంది భూమికి సంబంధించిన కొనుగోలు పత్రాలు, ఇంటి నంబర్లు, ఇతర అనుమతి పత్రాలతో బదులు ఇచ్చారని మున్సిపల్ అధికారులు తెలిపారు. నోటీసు అందుకున్న వారంతా సంజాయిషీ పత్రాలు అందజేసిన తర్వాత కలెక్టర్‌కు నివేదిస్తామని కమిషనర్ గంగాధర్ తెలిపారు.

### దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వివిధ రంగాల్లో మైనార్టీలకు వృత్తి శిక్షణ ఇచ్చి ఉద్యోగ కల్పన కోసం వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్, అకౌంటింగ్, కన్‌స్ట్రక్షన్, వెటర్నరీ–డెయిరీ, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, హార్టికల్చర్ తదితర శిక్షణకు భాగస్వాములుగా నియమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల సంస్థలు దరఖాస్తులను హైదరాబాద్–నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో అక్టోబర్ 4న సాయంత్రం 5 గంటల్లో సమర్పించాలని తెలిపారు. వివరాలకు నస్పూరులోని కలెక్టరేట్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.